మార్కెట్లకు షాక్

మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలతో అమ్మకాల ఒత్తిడిలోకి మదుపరులు

సెన్సెక్స్ 511, నిఫ్టీ 140 పాయింట్లు డౌన్

ముంబై, జూన్ 23: దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల ప్రభావం కనిపించింది. సోమవారం మదుపరులు అమ్మకాలకు పెద్దపీట వేశారు. దీంతో ఉదయం ఆరంభం నుంచే సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 511.38 పాయింట్లు లేదా 0.62 శాతం కోల్పోయి 82వేల స్థాయి దిగువకు చేరి 81,896.79 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 931.41 పాయింట్లు పడిపోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 140.50 పాయింట్లు లేదా 0.56 శాతం దిగజారి 24,971.90 వద్ద నిలిచింది.

టెక్ షేర్లకు దూరంగా..

ఐటీ, ఐటీ అనుబంధ, టెక్నాలజీ రంగాల షేర్లకు ఇన్వెస్టర్లు దూరంగా జరిగారు. ఐటీ సూచీ 1.48 శాతం, ఐటీ అనుబంధ రంగాల సూచీ 1.46 శాతం, టెక్నాలజీ ఇండెక్స్ 1.10 శాతం, ఆటో 0.88 శాతం, ఎఫ్ఎంసీజీ 0.62 శాతం, టెలికమ్యూనికేషన్ 0.50 శాతం, బ్యాంకింగ్ 0.38 శాతం చొప్పున పడిపోయాయి. సెన్సెక్స్‌లో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, ఐటీసీ, టీసీఎస్, మారుతీ షేర్లు బాగా నిరాశపర్చాయి. అయితే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.57 శాతం, మిడ్‌క్యాప్ 0.20 శాతం మేర పెరిగాయి. ఇరాన్‌లోని ప్రధాన అణు స్థావరాలపై అమెరికా బాంబులు వేయడం ఒక్కసారిగా ఉద్రిక్తతల్ని పెంచేసింది. ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసినట్టు నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు నష్టపోయాయి. చైనా, హాంకాంగ్ సూచీలు మాత్రం లాభాల్లో ముగిశాయి. ఇక బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్ 0.49 శాతం పెరిగి 77.39 డాలర్లు పలికింది.

5 నెలల కనిష్ఠానికి రూపీ

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ సోమవారం భారీగా క్షీణించింది. ఈ ఒక్కరోజే 23 పైసలు పడిపోయి 5 నెలలకుపైగా కనిష్ఠాన్ని తాకుతూ 86.78 వద్ద నిలిచింది. ఈ ఏడాది జనవరి 13న 86.70 వద్ద ముగిసింది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే ఆ స్థాయి దరిదాపుల్లోకి వెళ్లింది. కాగా, ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడుల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడి చమురు ధరలు.. ఫారెక్స్ మార్కెట్‌లో ఒక్కసారిగా దేశీయ దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్‌ను తెచ్చిపెట్టాయి. దీంతో రూపాయి బలహీనపడిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఒకానొక దశలో అధిక చమురు ధరలతో 86.85 స్థాయికి దిగజారింది. ఇదిలా వుంటే ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇంకా పెరిగితే రూపీ వాల్యూ కూడా మరింతగా క్షీణించవచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. 87 మార్కు దిగువకు పడిపోవచ్చని అంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేస్తూ 87.59కు పతనమైన విషయం తెలిసిందే.

ఎగుమతికి బ్రేక్

ఇజ్రాయెల్-ఇరాన్ సంఘర్షణలతో దేశీయ పోర్టుల్లోనే లక్ష టన్నుల బాస్మతి నిల్వలు

సంక్షోభంపై కేంద్రంతో చర్చలకు బియ్యం ఎగుమతిదారులు

- సౌదీ అరేబియా తర్వాత ఇరాన్‌కే భారత్ నుంచి ఎక్కువగా బాస్మతి ఎగుమతి.
- దేశీయ బియ్యం ఎగుమతుల్లో ఇరాన్‌దే 18-20 శాతం వాటా.
- గత 2024-25లో ఇరాన్‌కు సుమారు 10 లక్షల టన్నుల బియ్యం.
- మిడిల్ ఈస్ట్ దేశాలతోపాటు పశ్చిమాసియా దేశాలకు ఎగుమతైన బియ్యం 60 లక్షల టన్నులు.
- ఇరాక్, యూఏఈ, అమెరికా దేశాల్లోనూ మన బాస్మతి బియ్యానికి భారీగా గిరాకీ.

న్యూఢిల్లీ, జూన్ 23: ఇజ్రాయెల్-ఇరాన్ సంఘర్షణ.. భారతీయ బాస్మతి బియ్యం ఎగుమతులకు బ్రేక్ వేసింది. దేశీయ రైస్ ఎగుమతుల్లో ఇరాన్ వాటానే 18-20 శాతంగా ఉంటున్నది. ఈ క్రమంలో ఆ దేశంలో నెలకొన్న పరిస్థితులు ఇక్కడి నుంచి అక్కడకు వెళ్లే బియ్యం సరఫరాకు ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయిప్పుడు. దీంతో దేశంలోని వివిధ పోర్టుల్లోనే దాదాపు లక్ష టన్నుల బాస్మతి బియ్యం నిల్వలు ఆగిపోయాయని సోమవారం అఖిల భారత బియ్యం ఎగుమతిదారుల సంఘం తెలియజేసింది.

తగ్గుతున్న ధరలు

ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల నడుమ మార్కెట్‌లో బియ్యం ధరలు క్రమేణా క్షీణిస్తున్నట్టు అఖిల భారత బియ్యం ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు సతీశ్ గోయల్ అన్నారు. ఇప్పటికే కిలో రూ.4-5 తగ్గినట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీతో పనిచేస్తూ పరిస్థితుల్ని తెలుసుకుంటున్నామని తెలిపారు. ఇక ఈ సంక్షోభంపై చర్చించేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్‌తో ఈ నెల 30న సమావేశం కానున్నామన్నారు.

చెల్లింపుల్లో ఆలస్యం

ఇరాన్‌కు భారత్ నుంచి ఎగుమతి అవుతున్న బాస్మతి బియ్యంలో 30-35 శాతం హర్యానాలో పండించినవే. ముఖ్యంగా కర్నల్, కైథల్, సోనిపట్ బియ్యానికి విదేశాల్లో మండి డిమాండ్ ఉన్నది. దీంతో ఆగిన బియ్యం ఎగుమతులతో అక్కడి ఎగుమతిదారులకు చెల్లింపులు ఆలస్యమవుతున్నాయి. ఇప్పటికే ఇరాన్‌కు ఎగుమతి అయిన దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించి రూ.1,500-2,000 కోట్ల చెల్లింపులు ఈ ఉద్రిక్తతల వల్ల ఆగిపోయినట్టు హర్యానా బియ్యం ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు సుశీల్ జైన్ తెలియజేశారు.

ఆందోళనకరమే: ఎఫ్ఐఈవో

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు గల్ఫ్ దేశాలకు సరకు రవాణా, అక్కడి డిమాండ్‌ను ప్రభావితం చేయవచ్చని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈవో) ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘర్షణలు ఇలాగే కొనసాగితే భారతీయ ఎగుమతులు పడిపోవచ్చన్నది. అలాగే షిప్పింగ్ వ్యయం పెరుగుతుందని, రవాణా సమయం అధికమవుతుందని, బీమా ప్రీమియంలూ ఎక్కువగానే ఉంటాయని ఎఫ్ఐఈవో అధ్యక్షుడు ఎస్‌సీ రల్హన్ అభిప్రాయపడ్డారు.

గుజరాత్‌లోని కండ్లా, ముంద్రా నౌకాశ్రయాల్లో ఎక్కువగా బియ్యం ఆగిపోయాయి. నౌకలు, షిప్పింగ్ ఇన్సూరెన్స్ రెండూ నిలిచిపోవడంతో బియ్యం ఎగుమతిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

-సతీశ్ గోయల్, అఖిల భారత బియ్యం ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు

వాణిజ్యంపై ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు ప్రభావం చూపుతున్నాయి. ఏటా దేశీయ బాస్మతి బియ్యం ఎగుమతుల్లో మూడింటా ఒక వంతు హర్యానా రాష్ట్రం నుంచే జరుగుతున్నాయి.

-సుశీల్ జైన్, హర్యానా బియ్యం ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు

హర్మూజ్ మూసేస్తే పెట్రో మంటలే!

తమపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేసేందుకు ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసేస్తామని బెదిరిస్తున్నది. ఇదే జరిగితే భారత్‌లో పెట్రో ధరలు పైపైకే. దేశ చమురు అవసరాలకు దిగుమతులే ఆధారం. ఆ దిగుమతుల్లో సగానికిపైగా సౌదీ తదితర గల్ఫ్ దేశాలే దిక్కు. ఇవన్నీ కూడా హర్మూజ్ జలసంధి ద్వారానే భారత్‌కు చేరుతున్నాయి. కాగా, కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఇటీవలి వివరాల ప్రకారం దేశంలో ప్రస్తుతం సుమారు 74 రోజులకు సరిపడా చమురు నిల్వలున్నాయి. ఇండియన్ ఆయిల్ వద్ద 40-42 రోజులు.. భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం వద్ద 24 రోజులు.. భారతీయ వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్స్ లిమిటెడ్ వద్ద 9 రోజులకు సరిపడా ఉన్నాయి.

ఫోన్‌పే 13,000 కోట్ల ఐపీవో!

న్యూఢిల్లీ, జూన్ 23: దేశీయ అతిపెద్ద ఫిన్‌టెక్ సంస్థ, డిజిటల్ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే.. తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు వడివడిగా సిద్ధమవుతున్నది. రూ.13వేల కోట్ల నిధుల సమీకరణే లక్ష్యంగా ఐపీవోకు రాబోతున్నట్టు సమాచారం. ఆగస్టులో క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెరింగ్ ప్రాస్పెక్టస్‌ను సమర్పించే వీలుందంటున్నారు. ఈ క్రమంలోనే పబ్లిక్ ఇష్యూ కోసం బ్యాంకర్లుగా కొటక్ మహీంద్రా క్యాపిటల్, జేపీమోర్గాన్ చేజ్, సిటీగ్రూప్, మోర్గాన్ స్టాన్లీలను నియమించుకున్నట్టు చెప్తున్నారు. అయితే కంపెనీ వర్గాలు మాత్రం దీనిపై స్పందించడం లేదు. ఇక ఈ వాల్‌మార్ట్ గ్రూప్ సంస్థ చివరిసారిగా రూ.7,021 కోట్ల నిధులను సమీకరించింది. అప్పుడు రూ.లక్ష కోట్లుగా సంస్థ విలువను లెక్కగట్టారు. 2016లో ఫోన్‌పే మొదలైంది. అప్పట్నుంచి ఇప్పటిదాకా రూ.18,000 కోట్ల నిధులను సేకరించినట్టు తెలుస్తున్నది. 61 కోట్లకుపైగా నమోదిత యూజర్లు, 4 కోట్లకుపైగా వ్యాపారులు దీన్ని వినియోగిస్తున్నారు. 2023-24లో సంస్థ ఏకీకృత నికర లాభం రూ.197 కోట్లుగా ఉన్నది. ఆదాయం రూ.5,064 కోట్లుగా నమోదైంది.

జీ-15 గ్రేడ్ మాకొద్దు

- సింగరేణి బొగ్గును తిరస్కరిస్తున్న థర్మల్ ప్లాంట్లు
- జీ-14 గ్రేడ్ కోల్‌పైనా విముఖత.. నాణ్యత లేమి కారణం

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో ఉత్పత్తి అవుతున్న జీ-15 గ్రేడ్ బొగ్గును థర్మల్ ప్లాంట్లు తిరస్కరిస్తున్నాయి. ఈ బొగ్గు మాకొద్దు బాబోయ్ అంటున్నాయి. జీ-14 గ్రేడ్ బొగ్గుదీ ఇదే పరిస్థితి. బొగ్గు గ్రాస్ క్యాలరిఫిక్ విలువ 2,800-3,100 మధ్య ఉంటే జీ-15 గ్రేడ్‌గా, 3,100- 3,400గా ఉంటే జీ-14 గ్రేడ్‌గా పరిగణిస్తారు. ఈ తరహా బొగ్గు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఉత్పత్తి అవుతున్నది. సత్తుపల్లిలోని జేవీఆర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, ఇల్లందులోని జేకే ఓసీ, సీఎస్‌పీ, కొత్తగూడెం, మణుగూరుల్లో ఈ రెండు గ్రేడ్ల బొగ్గు ఉత్పత్తి అవుతున్నది. రోజుకు సింగరేణి 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తుండగా, 20 శాతం బొగ్గు ఈ రెండు గ్రేడ్లదే. అయితే తక్కువ నాణ్యతగల ఈ బొగ్గును థర్మల్ ప్లాంట్లు సరఫరా చేయవద్దంటున్నాయి.

బొగ్గు సరఫరా నిలిపివేత..

సింగరేణి బొగ్గును ఎక్కువగా థర్మల్ పాంట్లు వినియోగిస్తుంటాయి. బొగ్గు సరఫరాకు సింగరేణి పలు సంస్థలతో ఒప్పందాలు కుదర్చుకున్నది. థర్మల్ ప్లాంట్లతో ఏదైతే గ్రేడ్ బొగ్గును సరఫరా చేస్తామని ఒప్పందం జరుగుతుందో.. అదే గ్రేడ్ బొగ్గును సరఫరా చేయాలి. ఇలా చేయలేని పక్షంలో థర్మల్ ప్లాంట్లకు సింగరేణి నష్టపరిహారం కూడా చెల్లించాలి. కాగా, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, థర్మల్ ప్లాంట్లు తిరస్కరణల మధ్య ఈ రెండు గ్రేడ్ల బొగ్గు సరఫరాను సింగరేణి నిలిపివేసింది. అయితే ఈ రెండు గ్రేడ్ల బొగ్గును జీ-5, జీ-6 గ్రేడ్ల బొగ్గులో మిక్సింగ్ చేస్తున్నారు. దీని ద్వారా బొగ్గు నాణ్యతను మెరుగుపరుస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

హౌజింగ్ సేల్స్ ఢమాల్!

- ఈ ఏప్రిల్-జూన్‌లో లక్ష యూనిట్లకు దిగువనే అమ్మకాలు?: ప్రాప్‌ఈక్విటీ
- హైదరాబాద్‌లో 20 శాతం పతనం?

న్యూఢిల్లీ, జూన్ 23: దేశంలోని 9 ప్రధాన నగరాల్లో ఇండ్ల అమ్మకాలు ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అంతంతమాత్రంగానే ఉంటాయని ప్రాప్‌ఈక్విటీ అంచనా వేసింది. తాజా వివరాల ప్రకారం ఈసారి ఓవరాల్‌గా 94,864 యూనిట్ల విక్రయాలకే పరిమితం కావచ్చని తేలింది. గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో 1,16,432 యూనిట్ల విక్రయాలు జరుగగా, దానితో పోల్చితే ఇప్పుడు 19 శాతం తగ్గుతాయని తేటతెల్లమవుతున్నది. ఇదే నిజమైతే.. ఒక త్రైమాసికంలో లక్ష ఇండ్లు కూడా అమ్ముడుపోని పరిస్థితి రావడం 14 త్రైమాసికాల్లో ఇదే తొలిసారి. 2021 జూలై-సెప్టెంబర్‌లో లక్షకు దిగువనే హౌజింగ్ సేల్స్ ఉన్నాయి. కాగా, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, నవీ ముంబై, థానే, పుణె, కోల్‌కతా, చెన్నై నగరాల్లోని హౌజింగ్ సేల్స్‌పై ఈ సర్వే జరిగింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో 20 శాతం పడిపోయి 11,815కు పరిమితం కావచ్చని ప్రాప్‌ఈక్విటీ చెప్తున్నది. గత ఏడాది ఏప్రిల్-జూన్‌లో 14,704 యూనిట్ల సేల్స్ ఉన్నట్టు తెలిపింది. ఈ అంచనాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. దీనికి కారణం మోదీ సర్కారేనని దుయ్యబట్టారు. ప్రజల జేబులను ఖాళీ చేశారని, ఇండ్లు కొనుక్కునే పరిస్థితి ఎక్కడుందని మండిపడ్డారు.

రూ.700కే 130 కి.మీ విమానయానం!

న్యూయార్క్: విమానయాన రంగంలో ఒక సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమైంది. అమెరికాకు చెందిన బీటా టెక్నాలజీస్ సంస్థ అభివృద్ధి చేసిన పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ విమానం 'ఆలియా సీఎక్స్300', మొట్టమొదటి వాణిజ్య ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుంది. నలుగురు ప్రయాణికులతో న్యూయార్క్ పోర్ట్ అథారిటీ పరిధిలోని ఈస్ట్ హాంప్టన్ నుంచి జాన్ ఎఫ్ కెన్నడీ విమానాశ్రయం వరకు సాగిన ఈ ప్రయాణం, ఒక మైలురాయిగా నిలిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ చారిత్రక ప్రయాణంలో ముఖ్యమైన అంశం.. దాని ఖర్చు. సుమారు 130 కిలోమీటర్ల దూరానికి అయిన ఇంధన ఖర్చు కేవలం 8 అమెరికన్ డాలర్లు (సుమారు రూ.700) మాత్రమే!. ఈ విజయం ప్రాంతీయ విమాన ప్రయాణాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలకనుంది.

గుజరాత్‌లో బీజేపీకి షాక్

- విసావదర్ బైపోల్స్‌లో ఆప్ గెలుపు
- కడీ శాసన సభ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకున్న కమలం పార్టీ
- 4 రాష్ట్రాల్లో 5 అసెంబ్లీ స్థానాల ఫలితాలు విడుదల చేసిన ఈసీ

న్యూఢిల్లీ, జూన్ 23: ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో అధికార బీజేపీకి షాక్ తగిలింది. విసావదర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ఆప్ జయభేరి మోగించింది. ఇక్కడ ఆప్ అభ్యర్థి గోపాల్ ఇటాలియా 17,554 ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు. గోపాల్ ఇటాలియాకు 75,943 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి కిరిత్ పటేల్‌కు 58,388 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి నితిన్ రాన్‌పరయకు కేవలం 5,501 ఓట్లు పోలయ్యాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ఆప్ అభ్యర్థి భూపేంద్ర భయానీ గెలుపొందారు. అయితే 2023లో ఆయన పదవికి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు. దీంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, గుజరాత్‌లోని కడీ స్థానాన్ని బీజేపీ నిలబెట్టుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని కాలీగంజ్‌లో టీఎంసీ అభ్యర్థి అలీఫా అహ్మద్ 50వేల ఓట్ల ఆధిక్యంతో బీజేపీ అభ్యర్థి ఆశిష్ ఘోష్‌పై గెలుపొందారు. ఇక పంజాబ్‌లోని లూథియానా పశ్చిమ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి సంజీవ్ అరోరా 10,637 ఓట్ల ఆధిక్యంతో గెలుపు సాధించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై ఆయన విజయం సాధించారు. కేరళలోని నీలాంబర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్యదన్ షౌకత్ 11,000 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. సీపీఐ(ఎం) అభ్యర్థి ఎం.స్వరాజ్‌పై 11,077 ఓట్ల ఆధిక్యంతో షౌకత్ గెలిచారు.

రాష్ట్రం	నియోజకవర్గం	గెలుపొందిన పార్టీ	మెజార్టీ	సిట్టింగ్ పార్టీ
గుజరాత్	విసావదర్	ఆప్	17,554	ఆప్
గుజరాత్	కడీ	బీజేపీ	39,452	బీజేపీ
పంజాబ్	లూథియానా (వెస్ట్)	ఆప్	10,637	ఆప్
కేరళ	నీలాంబర్	కాంగ్రెస్	11,077	ఇండిపెండెంట్
బెంగాల్	కాలీగంజ్	టీఎంసీ	50,000	టీఎంసీ

ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య

- ల్యాండింగ్ కాకుండానే వెనక్కి..

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయల్దేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఊహించని విధంగా వెనుతిరిగింది. మార్గమధ్యలో జమ్ములో ఆగాల్సి ఉన్నా, అక్కడ ల్యాండ్ కాకుండానే తిరిగి ఢిల్లీకి చేరుకుంది. సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. ఢిల్లీ నుంచి బయల్దేరిన ఎయిరిండియా విమానం జమ్ము విమానాశ్రయానికి చేరుకున్నా.. విమానం ల్యాండ్ కాలేదని అధికారులు తెలిపారు. విమానం జీపీఎస్ వ్యవస్థలో అనుమానాస్పద జోక్యం వల్ల విమానం వెనక్కి మరలిందని ఎయిరిండియా అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు.

మరో విమానం రద్దు..

రన్‌వేపై వెళ్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో సాంకేతిక లోపాన్ని పైలట్ గుర్తించటంతో, జైపూర్ నుంచి దుబాయ్‌కు వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం సోమవారం రద్దయ్యింది.

స్విస్‌లో నల్లధనం ట్రిపుల్

'దేశ ఆర్థిక వ్యవస్థకు నల్లధనం పెనుముప్పుగా మారింది. మేము అధికారంలోకి వస్తే స్విస్ బ్యాంకుల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి ప్రతీ భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తాం'.. 2014 ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన హామీ ఇది. మోదీ ఇచ్చిన అన్ని హామీల్లాగే ఇది కూడా జుమ్లాగానే మిగిలిపోయింది. రూ. 15 లక్షలు జమ చేసేమాట దేవుడెరుగు.. ఎన్డీయే పాలనలో స్విస్ బ్యాంకుల్లో భారతీయ సంపన్నుల డబ్బు అంతకంతకూ పెరిగిపోతూనే ఉన్నది. స్విస్ నేషనల్ బ్యాంకు (ఎస్ఎన్‌బీ) తాజా గణాంకాలే దీనికి రుజువు.

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్విస్ బ్యాంకుల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెనక్కి తీసుకురావడంలోనే కాదు.. ఆ నల్లధనం పెరుగుదలను కట్టడి చేయడంలోనూ కేంద్రంలోని ఎన్డీయే సర్కారు చేతులెత్తేసింది. ఫలితంగా.. గత ఏడాది స్విస్ ఖాతాల్లోని భారతీయుల సంపద ఏకంగా మూడు రెట్లు పెరిగింది. ఈ మేరకు స్విస్ నేషనల్ బ్యాంకు (ఎస్ఎన్‌బీ) తాజా గణాంకాల్లో వెల్లడైంది.

మూడు రెట్లు జంప్

దేశంలోని రాజకీయ పెద్దలు, కార్పొరేట్లు స్విస్ ఖాతాల్లో జమ చేస్తున్న డిపాజిట్లు కొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఎస్ఎన్‌బీ తాజా గణాంకాల ప్రకారం.. స్విట్జర్లాండ్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు 2024లో మూడు రెట్లు పెరిగి సుమారు రూ.37,718 కోట్ల (3.5 బిలియన్ స్విస్‌లు)కు చేరింది. 2021 తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. 2023లో స్విస్ ఖాతాల్లో భారతీయుల డబ్బు రూ. 9,800 కోట్లుగా ఉన్నట్టు నిరుడు ఎస్ఎన్‌బీ ఓ నివేదికలో వెల్లడించింది. తాజా గణాంకాలను బట్టి ఏడాదిలోనే నల్లధనం మూడు రెట్లు పెరిగినట్టు అర్థమవుతున్నది.

2023లో తగ్గింది అందుకేనా??

2021లో స్విస్ ఖాతాల్లో భారతీయుల డబ్బు రూ. 30 వేల కోట్ల వరకూ ఉన్నది. ఆ మరుసటి ఏడాది కూడా దాదాపుగా ఇంతే డబ్బు కొనసాగింది. అయితే, 2023లో ఇది ఏకంగా రూ. 20 వేల కోట్ల మేరకు తగ్గి రూ. 9,800 కోట్లకు పడిపోయింది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతోన్న వేళ ఖర్చుల కోసం రాజకీయ పెద్దలు, కార్పొరేట్లు ఒక్కసారిగా స్విస్ బ్యాంకుల నుంచి డబ్బును ఉపసంహరించుకున్నారనే అనుమానాలు అప్పట్లో పెద్దయెత్తున వచ్చాయి. ఈ కారణంగానే 2023లో 70 శాతం మేర నిల్వలు తగ్గిపోయాయన్న వాదనలు వినిపించాయి. దీన్ని ధ్రువపరుస్తూ.. ఎన్నికల అనంతరం తిరిగి స్విస్ ఖాతాల్లో నిల్వలు నాలుగేండ్ల గరిష్ఠానికి చేరడం గమనార్హం.

నల్లధనంలో రాకెట్ వేగంతో..

మోదీ ప్రభుత్వ హయాంలో నల్లధనం ర్యాంకుల్లో భారత్ రాకెట్ వేగంతో దూసుకుపోతున్నది. స్విస్ బ్యాంక్ డిపాజిట్లలో 2015లో భారత్ ర్యాంకు 75గా ఉండగా.. ప్రస్తుతం 48కు చేరింది. అంటే ఎన్డీయే పాలనలో నల్లధనం సూచీలో భారత్ ర్యాంకు 27 స్థానాలు ఎగబాకింది. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాతే స్విస్ బ్యాంకుల్లో భారత డిపాజిట్లు అమాంతం పెరిగాయని దీన్నిబట్టి స్పష్టమవుతున్నది. కాగా సంపన్న కుటుంబాలు, కార్పొరేట్లు తమ ఆస్తులను బినామీల ద్వారా డిపాజిట్ చేసుకుని రక్షించుకోవడానికి స్విట్జర్లాండ్‌లోని ట్రస్ట్ చట్టాలు అవకాశం కల్పిస్తున్నాయి. ఇలాంటి వాటిని స్విస్ నల్లధనంగా పరిగణించదు. అయితే, బయటి దేశాలు మాత్రం ఈ సొమ్మును చట్టబద్ధమైనదిగా గుర్తించవు.

స్విస్ బ్యాంకులో నల్లధనం.. భారత్ ర్యాంకు (తక్కువ ర్యాంకు.. ఎక్కువ నల్లధనానికి సూచిక)

సంవత్సరం	ర్యాంకు
2015	75
2016	88
2017	88
2018	73
2019	74
2020	70
2021	45
2022	46
2023	67
2024	48

స్విస్ బ్యాంకుల్లో భారతీయుల డబ్బు ఏ రూపాల్లో.. ఎంత?

ఇతర బ్యాంకుల నుంచి
రూ. 32,169 కోట్లు

కస్టమర్ డిపాజిట్లు
రూ. 3,675 కోట్లు

ట్రస్ట్‌ల ద్వారా
రూ. 436 కోట్లు

బాండ్లు, సెక్యూరిటీలు, ఇతరాలు
రూ. 1,438 కోట్లు

రూ. 2,115 లక్షల కోట్ల నల్లధనం?!

స్విస్ బ్యాంకుల్లో భారతీయులు దాచుకొన్న నల్లధనం కేవలం రూ. 37,700 కోట్లేనా అనే అనుమానం అందరికీ రావొచ్చు. అయితే, ఈ డబ్బు భారతీయుల గుర్తింపు పత్రాల ఆధారంగా జమ చేసిన మొత్తాలు మాత్రమేనని నిపుణులు చెప్తున్నారు. డొల్ల కంపెనీలు, బినామీ పేర్లతో జమ చేసిన భారతీయుల నల్లధనం మొత్తం దాదాపు రూ. 2,115 లక్షల కోట్ల వరకూ ఉండొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇంటర్నేషనల్ కన్సార్టియమ్ ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుల సంఘం సైతం ఇవే అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ కారణంగానే 2014 ఎన్నికల సమయంలో నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చి దేశ ప్రజల ఖాతాల్లో రూ. 15 లక్షల చొప్పున జమ చేస్తానని మోదీ చెప్పినట్టు పలువురు గుర్తు చేస్తున్నారు. ఊరూ-పేరూ లేని ఈ ఖాతాలు ఏ దేశానికి చెందినవో వివరాలు తెలియకపోవడంతో స్విస్ నేషనల్ బ్యాంకు గణాంకాలను బహిర్గతపర్చట్లేదని, మొత్తం డబ్బు లక్షల కోట్లలోనే ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

2029లో రోదసిలోకి తెలుగు యువతి

- నాసా ఇంటర్నేషనల్ ప్రోగ్రాం పూర్తి చేసిన దాంజిటి జాహ్నవి
- తొలి భారతీయురాలిగా గుర్తింపు

న్యూయార్క్: 'నాసా' ఇంటర్నేషనల్ ఎయిర్, స్పేస్ ప్రోగ్రాం పూర్తిచేసుకున్న తొలి భారతీయురాలిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాంజిటి జాహ్నవి వార్తల్లో నిలిచారు. తద్వారా అమెరికా 2029లో చేపట్టబోయే రోదసి యాత్రకు సిద్ధమవుతున్నారు. ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసిన జాహ్నవి నాసా స్పేస్ ప్రోగ్రాంను డిస్టింక్షన్‌లో విజయవంతంగా పూర్తి చేసిన తొలి భార